క్లుప్తంగా

శాకంబరీ దేవిగా ముత్యాలమ్మ తల్లి



పెడన: పట్టణంలోని పాతపేటలో ఉన్న చిన్నపెడమ్మ ముత్యాలమ్మ తల్లిని బుధవారం సాయంత్రం శాకంబరీ దేవిగా అలంకరించారు. పాతపేటకు చెందిన భక్తబృందం ఆధ్వర్యంలో దాతలు వితరణగా ఇచ్చిన కూరగాయలతో అమ్మవారిని ఆకర్షణీయంగా పేర్చారు. గురువారం గురుపౌర్ణమిని పురస్కరించుకుని అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఉద్యోగులకు సత్కారం

పెడన: ప్రభుత్వ విధుల పట్ల ఉద్యోగులు బాధ్యతతో పాటు అంకిత భావంతో పనిచేసినప్పుడే మంచి గుర్తింపు వస్తుందని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా అన్నారు. బుధవారం రెండో సచివాలయంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న ఉద్యోగులను ఆయన ఘనంగా సన్మానించారు.

శ్రీభ్రమరాంబ తల్లికి వైభవోపేతంగా ఆషాఢ సారె



టి.కొత్తపాలెం(నాగాయలంక): గ్రామంలోని పురాతనమైన శ్రీభ్రమరాంబ సమేత శ్రీమల్లేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారికి బుధవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆషాఢ సారెను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకుడు అంబా సాయికిరణ్ శర్మ బ్రహ్మత్వంలో అమ్మవారికి ఆషాఢ సారె కార్యక్రమాన్ని గ్రామీణ సంప్రదాయబద్ధంగా జరిపారు. టి.కొత్తపాలెం, తలగడదీవి పరిసర గ్రామాల ప్రజలు ఈ ఉత్సవంలో అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. గ్రామస్తులు సమష్టిగా గ్రామ దేవత గంగానమ్మ తదుపరి భ్రమరాంబ తల్లికి సారె సమర్పణ పూజలు నిర్వహించారు.

తహసీల్దార్ విజయ ప్రసాద్‌కు రజతపతకం



ఘంటసాల: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కృష్ణా జిల్లా శాఖ తరఫున ఘంటసాల తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదగా సిల్వర్ మెడల్ అందుకున్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బుధవారం జరిగిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏపీ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన ఈ అవార్డు అందుకున్నారు.

ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్‌కు ఏఎస్పీ నివాళి



కోనేరుసెంటర్: కృష్ణాజిల్లా ఏఆర్ విభాగంలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందిన బి.వెంకటేశ్వరరావు (ఏఆర్‌హెచ్‌సీ – 358) భౌతిక కాయాన్ని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు బుధవారం జిల్లా ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ వెంకటేశ్వరరావు భౌతికకాయాన్ని సందర్శించి, ఘనంగా నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. పోలీసుశాఖ తరఫున మట్టి ఖర్చుల నిమిత్తం లక్ష రూపాయలను అందజేశారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో వృక్షారోహణం

ఘంటసాల: భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని బజరంగదళ్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు శ్రీరామశర్మ మహంకాళి అన్నారు. కృష్ణాజిల్లా విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ పిలుపు మేరకు విశ్వహిందూ పరిషత్ ఘంటసాల గ్రామ కమిటీ అధ్యక్షుడు చుండూరి అశోకరావు వృక్షారోహణం (మొక్కలునాటే) కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు ఆలయాల ప్రాంగణాల్లో వివిధ రకాల మొక్కలు నాటారు.

నేడు డయల్ యువర్ డీఎం

అవనిగడ్డ: స్థానిక ఆర్టీసీ కార్యాలయంలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ కె.హనుమంతరావు తెలిపారు. ఉదయం 11.30 నుంచి 12.30 గంటల మధ్య జరిగే ఈ కార్యక్రమంలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు సర్వీసుల విషయంలో సెల్ 99592 25466 కు ఫోన్ చేసి సూచనలు, సలహాలు అందించవచ్చని సూచించారు.

పంట కాలువల్లో తొలగించని గుర్రపు డెక్క

నీరందక రైతులు విలవిల

- నీటి ప్రవాహానికి అడ్డుగా గుర్రపు డెక్క , కర్రనాచు
- లీకుల ద్వారా వస్తున్న నీటిని ఆయిల్ ఇంజన్లతో తోడుకుంటున్న రైతులు
- గత ప్రభుత్వంలో రూ.8 లక్షలు కేటాయింపు... కూటమి ప్రభుత్వం రూ.2లక్షలు మాత్రమే విడుదల
- అరకొర నిధులతో ఏం చేయాలో తోచక తలలు పట్టుకుంటున్న ఇరిగేషన్ అధికారులు



సాయిరాజ్ పంట కాలువలో నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న గుర్రపు డెక్క



నందిగామ వద్ద నీరందక ఎండుతున్న వెద వేసిన వరి సాగు

పెడన: మండలంలోని పలు పంట కాలువల నుంచి నీరు విడుదల చేయకపోవడంతో రైతులు విలవిలలాడుతున్నారు. పంట కాలువలలో గుర్రపు డెక్క, కర్రనాచు పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. లీకుల ద్వారా వస్తున్న నీరు కూడా పారుదల లేకపోవడంతో పూర్తి స్థాయిలో నీరు వదిలినా కిందకు రాని దుస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. న్యూబీఎస్ చానెల్ ద్వారా సాయిరాజ్ కాలువ 111 ద్వారా మండలంలోని గురువిందగుంట, కవిపురం, కూడూరు, కృష్ణాపురం, నందిగామ గ్రామాలకు చెందిన సుమారు 2వేల ఎకరాలకు పైగా పంట పొలాలున్నాయి. వీటిలో ఇప్పటికే వెద సాగు ద్వారా 60 శాతం, మరో 20 శాతం వరినారు వేసినవి ఉన్నాయి. వీటిని బతికించుకోవడానికి రైతులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం.

రూ.2 లక్షల నిధులు ఎలా సరిపోతాయి?

కొతరం సెక్షన్ కింద ఉన్న న్యూ బీఎస్, సాయిరాజ్, మాలకోడు తదితర పంట కాలువల్లో తూడు, గుర్రపు డెక్క, కర్రనాచు తొలగించడానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.8లక్షలు నిధులు కేటాయించారు. ప్రస్తుతం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కేవలం రూ.2లక్షలు మాత్రమే నిధులు కేటాయించడంతో వాటిని ఏ విధంగా ఖర్చుపెట్టాలనే దానిపై ఇరిగేషన్ అధికారులతో పాటు ఇటీవల కొత్తగా వచ్చినటువంటి నీటి సంఘాల నాయకులు సైతం తర్జనభర్జనలు పడుతున్నారు. ఈ కారణంగా తూడు, గుర్రపు డెక్క, కర్రనాచు తొలగింపులో మరింత జాప్యం జరుగుతోంది. తక్షణం గుర్రపు డెక్క తొలగింపు చర్యలు చేపట్టి కాలువల ద్వారా నీటిని విడుదల చేయాలని ఆయా గ్రామాలకు చెందిన రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పిచికారీ చేసిన నీటినే తోడుకుంటున్నారు

మరో పక్క ఇరిగేషన్ అధికారులు అరకొర వచ్చిన నిధులతో గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టారు. తూడు, గుర్రపు డెక్క ఉన్న ప్రాంతాల్లో ఇరిగేషన్ సిబ్బంది పిచికారీ చేస్తున్నారు. గుర్రపు డెక్క ఎండిపోయి అలాగే ప్రవాహానికి అడ్డంకిగా ఉంటోంది. మరో పక్క పిచికారీ చేసిన నీటినే చాలా మంది రైతులు ఆయిల్ ఇంజన్ల ద్వారా తోడుకుని పంటలకు పెడుతున్నారు. ఈ నీటిని పెట్టుకోవడం వల్ల ఆ పంట కాస్తా దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితులలో చాలా మంది రైతులకు ఈ విషయం తెలియక నీటిని తోడుకుని పంటను బతికించుకుందామనే ఆలోచనల్లో ఉన్నారు.

తొలగింపు పనులు చేపట్టాం



న్యూబీఎస్, సాయిరాజ్, మాలకోడు తదితర పంట కాలువలలో తూడు తొలగింపు పనులను ఇప్పటికే చేపట్టాం. రూ.2లక్షలు నిధులు కేటాయించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే గుర్రపు డెక్క ఉన్న చోట అవి చనిపోవడానికి పిచికారీ చేయిస్తున్నాం. నీరు పూర్తిస్థాయిలో విడుదల చేయలేదని, పిచికారీ చేసిన నీటిని తోడుకోవద్దని రైతులకు చెబుతున్నాం. అయినా వారు వినడం లేదు. తూడు తొలగింపు పనులు రెండు, మూడు రోజుల్లో పూర్తవగానే నీటిని కాలువలకు నీటిని విడుదల చేస్తాం.

– లక్ష్మీతులసి, ఏఈ, ఇరిగేషన్, కొతవరం సెక్షన్

గృహప్రవేశం కూడా చేయలేదు..కూల్చేస్తారా?

ఎమ్మెల్యేకి మొరపెట్టుకున్న బాధితురాలు



ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌కు మొరపెట్టుకుంటున్న మహిళ

పెడన: కష్టపడి ఇల్లు కట్టుకున్నా..ఇంకా గృహప్రవేశం కూడా చేయలేదు...ఇప్పుడు ఇల్లు పడేస్తామంటున్నారు...ఇదెక్కడి న్యాయం అంటూ ఒక మహిళ పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు మొర పెట్టుకుంది. పట్టణంలోని 2, 3 వార్డులలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ ఇంటింటికీ తిరుగుతూ ఆర్‌యూబీ కోసం మున్సిపల్ అధికారులు, సిబ్బంది మార్కింగ్ చేసిన ఇళ్ల వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా ఒక ఇంట్లోని మహిళ ఎమ్మెల్యేకు తన దీనగాథ వినిపిస్తుండగా ఒకానొక సందర్భంలో నేను చెప్పింది వినవా...మీరు చెప్పింది వినాలా...? అంటూ ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. అభివృద్ధి జరగాలంటే కూల్చివేత తప్పదని, అందరూ అంగీకరిస్తేనే అభివృద్ధి జరుగుతుందని చెప్పి, సుపరిపాలన కరపత్రం అందజేసి అక్కడనుంచి వెళ్లిపోయారు.

సాతులూరులో ఇంటింటికీ ఎన్‌సీడీ 3.ఓ సర్వే



సాతులూరు గ్రామంలో ఇంటి వద్ద రక్త పరీక్షలు చేస్తున్న ప్రత్యేక వైద్య బృందం సభ్యులు

బంటుమిల్లి: మండల పరిధిలోని సాతులూరు గ్రామంలో బుధవారం వైద్యులు, సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఎన్‌సీడీ 3.ఓ సర్వే నిర్వహించారు. పెదతుమ్మిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షణలో మచిలీపట్నం మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టరు కేఎం సుస్మిత, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మోక్షానంద్, అసిస్టెంట్ ప్రొఫెసర్, నర్సింగ్ విద్యార్థులు స్థానిక వైద్య సిబ్బందితో కలసి 50 గృహాలను సందర్శించి వారి వద్ద రక్త నమూనాలను సేకరించారు. ఈ బృందం సభ్యులు అసంక్రమిత వ్యాధులు బీపీ, షుగర్, క్యాన్సర్ తదితర పరీక్షలు చేశారు. అనుమానితులను మెరుగైన వైద్యం కోసం మచిలీపట్నం మెడికల్ కాలేజీకి రావాలని సిఫార్సు చేశారు. పరీక్షలతోపాటు క్యాన్సర్‌లో వచ్చే పలు జబ్బులపై తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కలిగించారు. ఆహార నియమాలు పాటిస్తూ యోగా, వ్యాయామం ద్వారా జబ్బులను నియంత్రించవచ్చని సూచించారు. కార్యక్రమంలో సాతులూరు సర్పంచ్ గొల్ల బాలస్వామి, వైద్యాధికారులు కె.సువర్చల, జయశ్రీ, సూపర్‌వైజర్లు విజయకుమార్, ఎం.దాసు, గాయత్రి, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంగళాపురంలో తొలగిన తాగునీటి కష్టాలు

సాక్షి ఎఫెక్ట్



కుళాయిల్లో వచ్చే తాగునీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

చల్లపల్లి: ఎట్టకేలకు అధికారులు మంగళాపురం వాటర్ స్టోరేజ్ ట్యాంకు పైపులైనుకు మరమ్మతులు చేశారు. దీంతో దళితవాడ వాసుల తాగునీటి కష్టాలు తీరాయి. ''మంగళాపురం దళితవాడలో దాహం కేకలు'' శీర్షికన ఈనెల 8వ తేదీన సాక్షి పత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. వెంటనే స్పందించిన అధికారులు పగిలిపోయిన ఇన్‌లెట్ పైపు స్థానంలో కొత్త పైపు ఏర్పాటు చేయటంతో తాగునీటి సరఫరాకు అడ్డంకులు తొలగాయి. గత ఐదు రోజులుగా నీటి కోసం అల్లాడుతున్న వారికి ఒక్కసారిగా గ్రామంలోని కుళాయిల్లో తాగునీరు రావటంతో అందరూ ఆనందం వ్యక్తం చేశారు. సమస్యను వెలుగులోకి తీసుకువచ్చిన సాక్షి పత్రికకు, వెంటనే స్పందించి సమస్య తీర్చిన పంచాయతీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

కూలిన వంతెన రక్షణ గోడ

- భయాందోళనలో గ్రామస్తులు
- అధికారులు, ప్రజా ప్రతినిధులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని విన్నపం



వంతెనకు ఇరువైపులా కూలిపోయిన రక్షణ గోడలు

మల్లంపల్లి(ఘంటసాల): ఊరులోకి వెళ్లాలన్నా, రావాలన్నా ఆ గ్రామానికి ఉన్న ఒకే ఒక వంతెన రక్షణ గోడ కూలిపోవడంతో ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఘంటసాల మండలం మల్లంపల్లి పంచాయతీ శివారు బొల్లపాడు గ్రామంలోని ప్రజలకు వెళ్లేందుకు, వచ్చేందుకు ఒకే ఒక వంతెన భీమనది డ్రెయిన్‌పై నిర్మించారు. వంతెన శిథిలావస్థకు చేరడంతో పాటు వంతెన రక్షణ గోడ మంగళవారం కూలిపోయిందని స్థానికులు తెలిపారు. దీంతో ఏ క్షణంలో ఏమి జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. బొల్లపాడు గ్రామస్తులు నిత్యావసర సరుకులు కావాలన్నా, ఆసుపత్రికి వెళ్లాలన్నా, పాఠశాలలకు విద్యార్థులను పంపాలన్నా, గ్రామస్తులు రాకపోకలు సాగించడానికి ఉన్న ఈ వంతెనే ఆధారం. గోడ కూలిపోవడంతో విద్యార్థులను తీసుకెళ్లేందుకు వాహనాలు గ్రామంలోకి రావడం లేదని వాపోతున్నారు. 2014లో ఈ వంతెనకు ఒక వైపు గోడ కూలిపోగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి రాకపోకలు నిలిపి వేశారని, వంతెన నిర్మాణం చేస్తామని గాలికి వదిలేశారని స్థానికులు ఆరోపించారు. ఇప్పుడు రెండో వైపు గోడ కూడా కూలిపోయిందని గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సుమారు 300 గడప ఉంది. సుమారు 25 మందికి పైగా విద్యార్థులు వాహనాల్లో వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. సుమారు 1000 ఎకరాలకు పైగా పొలాలకు ఈ మార్గం ద్వారానే రాకపోకలు.

నగరంలో ఉద్యోగ, కార్మికుల భారీ ర్యాలీ



సమ్మెలో భాగంగా మచిలీపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు, కార్మికులు

మచిలీపట్నంటౌన్: కార్మిక సంఘాల పిలుపులో భాగంగా బుధవారం మచిలీపట్నంలో ఉద్యోగులు, కార్మికులు విధులను బహిష్కరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్మికులు కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐఎఫ్‌టీయూ(న్యూ), ఉద్యోగ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బస్టాండ్ నుంచి కోనేరు సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఐటీయూ కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు, ఏపీడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ ఉద్యోగులు విధులను బహిష్కరించి ధర్నా నిర్వహించారు. ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.కిషోర్ కుమార్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.పోతరాజు, బ్యాంకింగ్ రంగ యూనియన్ నాయకులు సలాం, వాణి, సీపీఎం నాయకులు కొడాలి శర్మ నాయకత్వం వహించారు.

చల్లపల్లిలో...

చల్లపల్లి: కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు స్థానిక ప్రజా సంఘాలు, వామపక్షాల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బస్టాండు నుంచి ప్రధాన సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు, సీఐటీయూ మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మీర్ రిజ్వాన్, రైతు సంఘం జిల్లా నాయకులు జగన్, ఈపూరి రాంబాబు పాల్గొన్నారు.

నాగాయలంక: నాగాయలంక కేడీసీసీ బ్యాంకు ఎదుట మండలంలోని సహకార ఉద్యోగులు బుధవారం ధర్నా జరిపారు. యూనియన్ నాయకులు కోసూరు రామాంజనేయులు, పి.శ్రీనివాసరావు నేతృత్వంలో మండలంలోని ఆరు సొసైటీలకు చెందిన సీఈఓలు, గుమస్తాలు, ఇతర సిబ్బంది ఈ ధర్నాలో పాల్గొని బ్యాంకు కార్యకలాపాలను స్తంభింప చేశారు.

మోపిదేవిలో...

మోపిదేవి: లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ, ప్రజా సంఘాల పిలుపుమేరకు బుధవారం మోపిదేవిలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్‌నుంచి అంగన్‌వాడీ, ఏఎన్‌ఎం, డ్వాక్రా సంఘాల ప్రతినిధులతో ప్రధాన గుడి సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. అనంతరం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయంకు చేరుకుని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు, సహాయ కార్యదర్శి మరీదు సరేష్‌బాబు, సీఐటీయూ మండల కార్యదర్శి చిరివెళ్ల రాజశేఖర్ పాల్గొన్నారు.

ఘంటసాల: సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘంటసాల సెంటర్లో బుధవారం సమ్మె నిర్వహించారు. తమ డిమాండ్ల సాధనకు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

పెడనలో...

పెడన: సీఐటీయూ, ఉద్యోగ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన ప్రదర్శన, ర్యాలీలు నిర్వహించారు. పీఏసీఎస్‌ఉద్యోగులు కేడీసీసీ పెడన శాఖ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. మున్సిపల్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం నుంచి బంటుమిల్లి రోడ్డు సెంటరు వరకు తిరిగి అక్కడ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆశ వర్కర్లు పెడన బస్టాండు సెంటరు నుంచి బంటుమిల్లి రోడ్డు సెంటరు వరకు తిరిగి అక్కడ నుంచి బస్టాండు సెంటరు వరకు ర్యాలీ నిర్వహించారు.

బంటుమిల్లి: స్థానిక సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ధర్నా శిబిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ సభ్యులు, పంచాయతీ పారిశుధ్య కార్మికులు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు తమ సమస్యలు పరిష్కారం చేయాలంటూ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని జాతీయ బ్యాంకులు పనిచేయలేదు. అనంతరం ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కె.వి.పూర్ణచంద్రరావుకు వినతిపత్రం అందజేశారు.

గూడూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, పీఏసీఎస్ సిబ్బంది బుధవారం గూడూరు ప్రధాన సెంటరు నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దారు డి.రాజ్యలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు.

పాఠశాలల పరిధిలో పొగాకు ఉత్పత్తుల అమ్మకం నేరం

పెడన: పాఠశాలలకు వంద మీటర్ల పరిధి లోపల పొగాకు, గుట్కా, ఖైనీ, విదేశీ సిగరెట్లు వంటి వాటిని విక్రయించకూడదని పెడన సీఐ కె.నాగేంద్రప్రసాద్ స్పష్టం చేశారు. ఆయన బుధవారం ఈగల్ టీంతో పాటు పెడన ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బందితో కలిసి పట్టణంలోని బంగ్లా స్కూలు, బీజీకే జెడ్పీహెచ్‌ఎస్‌ల పరిధిలోని దుకాణాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల పరిధిలోని వంద మీటర్ల లోపల ఉన్న దుకాణాల్లో ఎటువంటి పొగాకు ఉత్పత్తులను అమ్మకూడదన్నారు. అలా అమ్మిన వారిపై అపరాధ రుసుంతో పాటు కేసులు నమోదు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

చల్లపల్లి: గుర్తు తెలియని అనాథ శవానికి మాజేరు పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. చల్లపల్లి–మచిలీపట్నం 216 జాతీయ రహదారిపై కొత్తమాజేరు అడ్డరోడ్డు వద్ద ఉన్న బస్‌షెల్టర్‌లో గత కొన్ని రోజులుగా గుర్తుతెలియని వ్యక్తి ఒకరు ఉంటున్నారు. బుధవారం ఉదయం ఆ వ్యక్తి ఎంతసేపటికీ లేవకపోవటంతో స్థానికులు పరిశీలించగా అతను మృతిచెందినట్లు ధ్రువీకరించుకుని విషయాన్ని మాజేరు పంచాయతీకి తెలిపారు. గ్రామ సర్పంచ్ కె.లక్ష్మీనాంచారమ్మ, పంచాయతీ సిబ్బంది వచ్చి అతనిని పరిశీలించారు. గ్రామానికి చెందిన ఉయ్యూరు రామ్మోహనరావు ఆర్థిక సహకారంతో అంత్యక్రియలు నిర్వహించారు.

నేడు అర్తమూరులో విద్యుత్ సరఫరా నిలిపివేత

బంటుమిల్లి: మండల పరిధిలోని అర్తమూరు సబ్ స్టేషన్(ఎస్ఎస్) పరిధిలో గురువారం ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ మచిలీపట్నం ఈఈ జి.గోవిందరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కోడూరు: షెడ్యూల్ మెయింటెనెన్స్‌లో భాగంగా గురువారం మండలంలోని చింతకోళ్ల ఫీడర్ కింద ఉన్న గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ గోపీచంద్ బుధవారం తెలిపారు. చింతకోళ్ల, పోటుమీద, పెదడుగుమోటు గ్రామాలతో పాటు ఆక్వా చెరువులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ కోత ఉంటుందని ఏఈ చెప్పారు.

కారు-బైక్ ఢీ : ఇద్దరికి తీవ్ర గాయాలు

కోడూరు: కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైన ఘటన కోడూరులో బుధవారం జరిగింది. నాగాయలంక మండలం భావదేవరపల్లి గ్రామానికి చెందిన కొప్పుల శోభనాద్రి, చిల్లముంత శ్రీనాథ్, చిల్లముంత గౌతమ్ వ్యక్తిగత పని నిమిత్తం బైక్ పై కోడూరుకు వచ్చారు. వీరు పని ముగించుకుని భావదేవరపల్లి వెళ్తుండగా కోడూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన ఉన్న మలుపులో నుంచి ఓ కారు వచ్చి వీరి ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై ఉన్న శోభనాద్రి, శ్రీనాథ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 ద్వారా అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పీఆర్ అధికారులకు శిక్షణ

మోపిదేవి: పంచాయతీ పురోగతికి ప్రధానంగా అన్ని లైన్ డిపార్ట్‌మెంట్స్ నుంచి 17 రకాల డేటాలు సేకరించి ఆన్‌లైన్ చేయాలని ఎంపీడీవో జె.స్వర్ణభారతి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్స్, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్, ఏఎన్‌ఎంలకు బుధవారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. సేకరించిన 17 డేటాల ఆధారంగా గ్రామ పంచాయతీలకు గ్రేడ్‌లు కేటాయించి వాటి ఆధారంగా ఎంపికైన పంచాయతీలకు రూ.50 నుంచి రూ.1 కోటి మంజూరు చేస్తారని తెలిపారు.

ఘంటసాలలో...

ఘంటసాల: గ్రామ పంచాయతీ పురోగతి సూచిక శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని ఆయా గ్రామ పంచాయతీలు అవార్డులు పొందడంలో పోటీ పడాలని ఎంపీడీవో డి.సుబ్బారావు తెలిపారు. ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ పురోగతి సూచిక అంశాలపై బుధవారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. అనంతరం ఘంటసాల గ్రామ సచివాలయాలు, పంచాయతీల నుంచి బదిలీపై వెళ్తున్న వివిధ శాఖల ఉద్యోగులను ఘనంగా సన్మానించారు.

అవనిగడ్డ ఆర్టీసీ డిపోను సందర్శించిన డీపీటీవో

అవనిగడ్డ: కృష్ణాజిల్లా ప్రజా రవాణా అధికారి(డీపీటీవో) కె.వెంకటేశ్వర్లు బుధవారం ఆర్టీసీ డిపోను సందర్శించారు. బస్‌స్టేషన్‌లోని మరుగుదొడ్లు, కార్గో కార్యాలయం, మహిళా సిబ్బంది విశ్రాంతి గది, తాగునీటి సౌకర్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొంతమంది ఆర్టీసీ ఉద్యోగులతో మాట్లాడి సౌకర్యాలు, సేవల గురించి తెలుసుకున్నారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు అందుతున్న సేవలను పరిశీలించారు. మరుగుదొడ్లు ఇంకా పరిశుభ్రంగా ఉంచాలని, సేవలను మెరుగు పరచాలన్నారు. ఆగస్టు నుంచి ప్రారంభించనున్న మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కార్యక్రమం అమలు తీరుపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కె.హనుమంతరావు, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలక్ష్మి, ఏఈ దివ్య పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

పెడన: పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా నడుచుకోవాలని మచిలీపట్నం డీఎల్‌పీవో రజావుల్లా అన్నారు. ఆయన బుధవారం నందమూరు గ్రామంలో పర్యటించి డ్వాక్రా మహిళలను కలిసి స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పించారు. ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శి జానకీలక్ష్మి, వెలుగు సీసీ కుంచె వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

తహసీల్దార్ శ్రీవిద్యకు సన్మానం

మోపిదేవి: స్థానిక తహసీల్దార్ శ్రీవిద్య బదిలీపై సీసీఎస్‌ఏకు వెళ్లడంతో కార్యాలయ సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. చల్లపల్లి తహసీల్దార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

ఉద్యోగులకు సత్కారం

కృత్తివెన్ను: బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళుతున్న సచివాలయ, పంచాయతీరాజ్ ఉద్యోగులను బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గరుడప్రసాద్ ఘనంగా సత్కరించారు. మండలానికి కొత్తగా వచ్చిన ఎంపీడీవో ఎ.అరుణకుమారికి ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి దుశ్శాలువా, పూలమాలతో ఘన స్వాగతం పలికారు.

కాలువలో పూడికతీత

కోడూరు: ఉల్లిపాలెం, కోడూరు, స్వతంత్రపురం, హరిపురం గ్రామాలకు సాగునీరు వెళ్లే 11వ నంబర్ పంటకాలువ పూడికతీత పనులను బుధవారం చేపట్టారు. పంటకాలువలో గుర్రపుడెక్క, తూటి కాడ అల్లుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డుగా మారింది. నీరు దిగువకు వెళ్లడానికి అడ్డుగా మారడంతో ఇరిగేషన్ అధికారులు స్పందించి ప్రక్షాళన చేపట్టారు. వంతెన సెంటర్ నుంచి తూర్పు వైపు వరకు పొక్లెయిన్ సహాయంతో తూడు, గుర్రపుడెక్కతో పాటు మురుగును బయటకు తరలించారు. నీటి సంఘం అధ్యక్షుడు బొలిశెట్టి వెంకటేష్ పనులను పర్యవేక్షించారు.

మొక్కలు పంపిణీ

మచిలీపట్నంఅర్బన్: హరితాంధ్రప్రదేశ్ వనం మనం కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో బుధవారం మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన ప్రతి ఒక్క పేషెంట్‌కు ఒక మొక్కను ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆశాలత పంపిణీ చేశారు.